సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



'మద్దతు' దక్కని పెసర

రైతులు యాసంగిలో అంతంత మాత్రంగా సాగు చేసిన పెసరకు మద్దతు ధర సైతం లభించకపోవడంతో నష్టపోతున్నారు. 8లో




ఏసీబీకి చిక్కిన ఏసీటీఓ

వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీటీఓ బృందం వద్ద రూ.10వేల నగదు లభించడంతో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయమే ఎండ మొదలై గంట గంటకు పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలుల ప్రభావం ఉంటుంది.



పాలేరు మళ్లీ కళకళ!

రిజర్వాయర్‌లోకి చేరుతున్న సాగర్ జలాలు

- క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం
- సాగు అవసరాలకు వాడకుండా అడుగడుగునా పర్యవేక్షణ


ఇన్‌ఫాల్ రెగ్యులేటరీ ద్వారా పాలేరుకు చేరుతున్న సాగర్ జలాలు

కూసుమంచి: నిన్నటి వరకు నీరు లేక వెలవెల బోయిన మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు గురువారం నుండి సాగర్ జలాలు చేరుతుండటంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ కళ సంతరించుకుంటోంది. సాగర్ నుండి 3,500 క్యూసెక్కుల మేర నీరు సరఫరా చేస్తుండగా, రిజర్వాయర్‌లో 5.5 అడుగులకు పడిపోయిన నీటిమట్టం ఒకే రోజులో 7.5 అడుగులకు చేరింది. పాలేరు రిజర్వాయర్ నుండి మిషన్ భగీరథ, ఇతర ప్రాజెక్టుల ద్వారా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని 2,439 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. ప్రతి రోజు 19.47 లక్షల మంది దాహార్తి తీరుస్తున్న నేపథ్యాన పాలేరుకు సాగర్ జలాలు చేరడంతో ఇక్కట్లు తీరనున్నాయి. కాగా, గురువారం సాగర్ జలాలు పాలేరుకు చేరుతుండగా నాయకన్‌గూడెం వద్ద ఇన్‌ఫాల్ రెగ్యులేటరీని ఖమ్మం ఆర్డీఓ గణేష్, ఇరిగేషన్ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ డీఈఈ మురళీకృష్ణ, తహసీల్దార్ సురేష్ తదితరులు పరిశీలించారు. సాగర్ జలాలను రిజర్వాయర్‌లో నిల్వ చేసి తాగునీటి అవసరాలకే వినియోగించేలా పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు.

మోటార్లు, ఎత్తిపోతలకు విద్యుత్ బంద్

పాలేరు రిజర్వాయర్ చుట్టుపక్కల కొందరు రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకుని తమ పొలాలకు సాగు నీరు అందిస్తుండగా అధికారులు ముందు జాగ్రత్తగా మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే లైన్లకు కరెంట్ తొలగించారు. దీంతో పాటు రిజర్వాయర్, కాల్వల ఆధారంగా ఏర్పాటు చేసిన లిఫ్టులకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మేజర్లు, లాకుల వద్ద సిబ్బందిని నియమించి నీరు వృథా కాకుండా పర్యవేక్షిస్తూనే కాల్వలపై ఉన్న విద్యుత్ మోటార్లను తొలగిస్తున్నారు. తద్వారా వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. కాగా, సాగర్ నుండి పాలేరుకు చేరుతున్న నీటితో రిజర్వాయర్‌ను నింపి బ్యాలెన్సింగ్ చేసేందుకు చర్యలు చేపట్టారు.


నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న అధికారులు

తొమ్మిది బృందాలతో నిఘా

పాలేరు రిజర్వాయర్‌కు చేరుతున్న నీటిని తాగు అవసరాలకే వినియోగించేలా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల ఉద్యోగులతో తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశారు. సాగర్ జలాలను పాలేరు నుండి ఖమ్మం నగరానికి, ఆతర్వాత వైరా రిజర్వాయర్‌కు తరలించనున్న నేపథ్యాన ఎక్కడ కూడా సాగు అవసరాలకు మళ్లించకుండా ఈ బృందాలు పర్యవేక్షిస్తాయి. అలాగే, పాలేరుకు సరఫరా అవుతున్న నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

మాది ప్రజలు గెలిపించిన ప్రభుత్వం

- కూల్చేస్తామనే వారి కలలు నెరవేరవు
- రెండు, మూడు రోజుల్లో ఖమ్మం అభ్యర్థిపై స్పష్టత
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రజల తీర్పుతో, ప్రజా ఆకాంక్షలతో ఏర్పడిన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని.. కూల్చేస్తామనే వారి కలలు నెరవేరే అవకాశం లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో కొనసాగడానికి ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఇష్టపడకపోగా, ఎప్పుడెప్పుడు కాంగ్రెస్‌లో చేరదామా అనే ఉత్సాహంతో ఉన్నారని పేర్కొన్నారు. అయినా తాము ఫిరాయింపులను ప్రోత్సహించడం లేదని భట్టి చెప్పారు. ఢిల్లీలో పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం నడుస్తోందని.. ఈ సమావేశాల్లో ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిపై చర్చించనుండగా రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 12 నుంచి 14 స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని చెప్పిన భట్టి.. ఎన్నికల్లో తమకు ఏ పార్టీ పోటీ ఇచ్చే పరిస్థితి లేదన్నారు.

గత ప్రభుత్వ తీరుతోనే నీటిసమస్య

పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ తీరుతోనే ప్రస్తుతం నీటి సమస్య వచ్చిందని.. గత వర్షాకాలంలో నీటిని సక్రమంగా వినియోగించుకోకపోవడంతోనే ఇప్పుడు ఇబ్బంది ఎదురవుతోందని భట్టి పేర్కొన్నారు. గత ప్రభుత్వం నీటిని రాజకీయాల కోసమే వాడుకోగా.. తాము ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిని తాగు అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. విద్యుత్ డిమాండ్ గరిష్టస్థాయిలో ఉన్నా అందుకు తగినట్లుగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. చాలా మంది నాయకులు వారి స్థాయి దిగజార్చుకుని మాట్లాడుతున్నారని, వారు నిర్వహించిన మీడియా సమావేశంలో కరెంట్ పోకపోయినా పోయినట్లుగా చెబుతూ ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని భట్టి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ సరైన రీతిలో ప్రభుత్వాన్ని నడపకపోవడంతోనే ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. తాము ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, కేంద్ర మంత్రి గడ్కరీ నుంచి రీజనల్ రింగ్ రోడ్డుకు క్లియరెన్స్ తీసుకొచ్చామని, ఇతర అంశాల్లోనూ నిధులపై ఒప్పించి తీసుకొచ్చామని భట్టి తెలిపారు. అంతేతప్ప ఢిల్లీ వెళ్లి ఇతర రాష్ట్రాల నేతలతో సమావేశమవుతూ దేశ్‌కీ నేత కావాలనుకోలేదని భట్టి చెప్పారు. కాగా, తుక్కుగూడలో నిర్వహించే సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీ స్థాయిలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు రాయల నాగేశ్వరరావు, జావీద్, మలీదు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

త్వరలోనే హెవీ లైసెన్స్ రెన్యువల్ ట్రాక్


మాట్లాడుతున్న డీటీఓ ఆఫ్రిన్ సిద్ధిఖీ

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: డ్రైవర్ల హెవీ లైసెన్స్ రెన్యూవల్ కోసం జిల్లా వాసులు సిరిసిల్లకు వెళ్లకుండా ఖమ్మంలోనే పరీక్ష నిర్వహించేలా ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని జిల్లా రవాణా శాఖ అధికారి ఆఫ్రిన్ సిద్ధిఖీ వెల్లడించారు. సత్తుపల్లిలోని రవాణాశాఖ కార్యాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు విరాట్‌నగర్‌లో కాల్వ స్థలాన్ని పరిశీలించారు. తొలుత ఆమె కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్‌జాదవ్, తహసీల్దార్ యోగేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఆతర్వాత డీటీఓ.. ఎంవీఐ విజయలక్ష్మితో కలిసి తెలంగాణ – ఏపీ సరిహద్దు పెనుబల్లిలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్


విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యాన నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఉదయం పరీక్షకు 537మందికి గాను 501మంది హాజరు కాగా 36మంది గైర్హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం పరీక్షకు 535మందికి 499మంది హాజరు కాగా 36మంది గైర్హాజరయ్యారని పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు.

గంట ఆలస్యంగా పరీక్ష?

ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ మండలం సాయిప్రభాత్‌నగర్‌లోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ కేంద్రం ఏర్పాటుచేయగా మొదటి సెషన్ పరీక్ష సాంకేతిక కారణాలతో గంట ఆలస్యంగా మొదలైనట్లు తెలిసింది. దీంతో విద్యార్థులకు అదనంగా అంతే సమయం ఇవ్వగా, మధ్యాహ్నం సెషన్ పరీక్ష అరగంట ఆలస్యంగా మొదలై అరగంట ఆలస్యంగా ముగిసిందని సమాచారం. ఈవిషయమై కళాశాల ప్రిన్సిపాల్ వివరణ కోరగా పరీక్ష ఆలస్యం కాలేదని తెలిపారు. కాగా, ఆలస్యంగా మొదలైనా అంతే సమయం ఎక్కువగా కేటాయించడంతో విద్యార్థులకు నష్టం జరగలేదని తెలుస్తోంది.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

ఖమ్మం సహకారనగర్: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినా, తరగతులు ప్రారంభించినా యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. అలాగే, పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. 2024–25వ విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ప్రకటన రాలేదని చెప్పారు. అయినా కొన్ని ప్రైవేట్ కళాశాలలు అనధికారికంగా అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈమేరకు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో అటవీ అనుమతి పత్రాలు

ఖమ్మంవన్‌టౌన్: అటవీ ఉత్పత్తుల రవాణా అనుమతులు ఇకపై ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చని డీఎఫ్‌ఓ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ తెలిపారు. ఉత్పత్తుల రవాణా ఆమోదం, అనుమతి పత్రాలే కాక నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా జారీచేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం www.ntps.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు సులభం చేసేందుకు ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు.

పరస్పర సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు

అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ గౌతమ్



తిరువూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ సునీల్‌దత్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, సీపీ కాంతిరాణా టాటా, ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు గురువారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా రెండు జిల్లాల కలెక్టర్లు గౌతమ్, ఎస్.డిల్లీరావు, సీపీలు కాంతిరాణా టాటా, సునీల్‌దత్ సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు వెంట ప్రత్యేక చెక్‌పోస్టుల ద్వారా నిఘా కట్టుదిట్టం చేశామని, నగదు, మద్యం తరలించకుండా తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. గతేడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయాన రెండు జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరించడంతో మంచి ఫలితాలు వచ్చినందున ఇప్పుడూ అలాగే వ్యవహరించాలని నిర్ణయించారు. ఈసమావేశంలో ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు

ఫిర్యాదులను పరిష్కరించండి

ఖమ్మం సహకారనగర్/కల్లూరు: ఎన్నికల వేళ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను సీపీ సునీల్‌దత్‌తో కలిసి తనిఖీ చేసిన ఆయన సీ విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారంపై ఆరాతీశారు. చెక్‌పోస్టు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల ఫుటేజీని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆతర్వాత కలెక్టర్, సీపీ కల్లూరులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు, వివిధ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్, కల్లూరు ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, సీపీఓ ఏ.శ్రీనివాస్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ ఎస్‌కే.షాకీర్, పీఆర్ డీఈ రాంబాబు, ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఆరాతీస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేనిచోట వ్యవసాయ బావులను అద్దెకు తీసుకోవాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీరుసరఫరా చేయాలని చెప్పారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, వివిధ శాఖల అధికారులు విద్యాసాగర్, సురేందర్, వినోద్, హరికిషన్, జి.గణేష్, పుష్పలత, వాణిశ్రీ పాల్గొన్నారు.

మేం వచ్చాకే జనరంజక పాలన

- అప్పులు తీరుస్తూనే సంక్షేమాన్ని అందిస్తున్నాం
- తుక్కుగూడ సభకు లక్షలాదిగా తరలిరావాలి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: పదేళ్ల కాలంలో రైతు రుణమాఫీ చేయని బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఖమ్మం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖలను బీఆర్‌ఎస్ భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. అవినీతి, కబ్జాలతో పాటు పోలీసుల సహకారంతో బీఆర్‌ఎస్ నేతలు తిరిగి అధికారంలోకి వస్తామని అనుకున్నా.. కాంగ్రెస్ శ్రేణుల శక్తిసామర్థ్యాల ఎదుట వారి ఆశలు పటాపంచలయ్యాయని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కటొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీ కడుతూనే హామీలను నెరవేరుస్తున్నామని తుమ్మల చెప్పారు. కాగా, అన్నిచోట్ల పంటలు కోతకు వచ్చాయని, జిల్లాలో నీరు లేక ఎక్కడా పంట ఎండిపోలేదన్నారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలపైనే రైతులు ఆధారపడుతున్నందున ఒక్క సెకన్ కూడా కరెంట్ పోకుండా రోజుకు రూ.50కోట్లు వెచ్చించి రాష్ట్రంలో కరెంట్ సరఫరా చేస్తున్నామని మంత్రి తెలిపారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసమే బీఆర్‌ఎస్ నేతలు నీళ్ల రాజకీయం చేస్తున్నారని.. కానీ వారికి అసెంబ్లీ ఎన్నికల మాదిరి పరాభవం తప్పదని చెప్పారు. తమ 120 రోజుల పాలనతో దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని.. అందుకనే ఇక్కడ ఇచ్చిన గ్యారంటీలను దేశమంతా అమలు చేస్తామని ప్రకటించేందుకు రాహుల్‌గాంధీ, ఖర్గే శనివారం తుక్కుగూడ సభకు వస్తున్నారని తెలిపారు.

ఈమేరకు జిల్లా నుంచి నుంచి తుక్కుగూడ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడగా డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, కొంగర జ్యోతిర్మయి, పాదిల రవికుమార్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి స్థానచలనం

- 45 ఎకరాల్లో నూతన భవన నిర్మాణాలు
- నగర శివార్లలో ఇప్పటికే స్థలం కేటాయింపు
- నిధులు సిద్ధంగా ఉండడంతో త్వరలోనే పనులు
- వచ్చే ఏడాదికల్లా అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక


పాత కలెక్టరేట్‌లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు స్థానచలనం కలగనుంది. ప్రభుత్వ నిర్ణయంతో కళాశాల తరలింపునకు అధికారులు సిద్ధమవుతున్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కళాశాలను నగర శివారు రఘునాథపాలెం మండలానికి తరలించాలని నిర్ణయించిన ప్రభుత్వం భూమిని సైతం కేటాయించినందున త్వరలోనే పనులు మొదలుకానున్నాయి. జిల్లా కేంద్రం దినదినాభివృద్ధి చెందుతుండగా రద్దీ పెరుగుతోంది. ప్రస్తుతం మెడికల్ కళాశాల నగరం నడిబొడ్డున కొనసాగుతుండగా.. భవిష్యత్‌లో ఇబ్బంది ఎదురుకావొద్దనే భావనతో రఘునాథపాలెం, బల్లేపల్లి పంచాయతీల పరిధిలో 45 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు. ఆ స్థలంలో విద్యార్థులకు బోధన, హాస్టళ్లకు సరిపడా భవనాలను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.


గత ఏడాది ప్రారంభం

ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీని గత ఏడాది సెప్టెంబర్ 15న అప్పటి సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. తొలుత మెడికల్ కాలేజీని మంజూరు చేయగా రూ.166 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అనుసంధానంగా కళాశాలకు స్థలాన్ని కేటాయించారు. బోధన, ప్రాక్టికల్స్, హాస్టళ్ల భవనాల కోసం సుమారు 25 ఎకరాలు అవసరం ఉంటుందని అంచనా వేయగా ఆస్పత్రి ఎదుట ఉన్న పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ భవనాలను సమకూర్చారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ 21.31 ఎకరాలు, కలెక్టరేట్ 5.23 ఎకరాలు, ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణ 3.09 ఎకరాలతో పాటు మరో రెండెకరాలకు పైగా పాత డీఎంహెచ్‌ఓ స్థలం కలిపి 32ఎకరాల మేర కేటాయించగా... ఆధునీకీకరణ పనులకు ప్రభుత్వం రూ.9 కోట్లు విడుదల చేసింది. దీంతో పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయాలను ఆధునీకీకరించడమే కాక పాత కలెక్టరేట్ వెనుకాల అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, లెక్చరర్ హాళ్లు, స్టాఫ్ రూమ్స్ నిర్మించారు. అలాగే పాత కలెక్టరేట్ భవనంలో అడ్మిన్ బ్లాక్, ఆడిటోరియం, విద్యార్థులకు క్యాంటీన్ ఏర్పాటుచేశారు. ఇక పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని బాయ్స్ హాస్టల్‌కు, ఆర్‌అండ్‌బీ భవనాన్ని గర్ల్స్ హాస్టల్‌కు కేటాయించారు. కాగా గత ఏడాది ఆగస్టు నుండి నీట్ ద్వారా ర్యాంకులు సాధించిన 100మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి తరగతులు బోధిస్తున్నారు.

ఆరు అంతస్తుల్లో భవనం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా కేంద్రం మధ్యలో ఉన్న మెడికల్ కళాశాలను తరలించాలని నిర్ణయించారు. అత్యాధునిక హంగులతో భవనాలు నిర్మించడంతో పాటు భవిష్యత్‌లో పారామెడికల్, డెంటల్, నర్సింగ్ కళాశాలలకు అనుమతి వచ్చినా సరిపోయేలా రఘునాథపాలెం, బల్లేపల్లి పంచాయతీల శివార్లలో సుమారు 45 ఎకరాలకు పైగా కేటాయించారు. రఘునాథపాలెం పంచాయతీ పరిధిలో 29.20 ఎకరాలు, బల్లేపల్లి పంచాయతీ పరిధిలో 16.26 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. గతంలో కేటాయించిన నిధులతోనే ఇక్కడ నూతన భవనాలు నిర్మిస్తారు. ప్రస్తుతం ఆరు అంతస్తుల్లో భవనం నిర్మించి బోధనతో పాటు బాలికలు, బాలుర హాస్టళ్లు, ప్రిన్సిపాల్ క్వార్టర్లకే కేటాయిస్తారు. మరోపక్క ప్రస్తుత కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం అనుమతి కోసం ఆన్‌లైన్‌లో నివేదికలు సమర్పించిన అధికారులు.. విద్యార్థుల కోసం ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, పాథాలజీ విభాగాలను సిద్ధం చేస్తున్నారు. ఆపై విద్యార్థులు మూడో సంవత్సరానికి చేరేలోగా ఎంపిక చేసిన స్థలంలో భవనాల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. తొలిదశలో వారికి అవసరమైన ఈఎన్‌టీ, ఆఫ్తాల్మిక్, సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్(ఎస్‌పీఎల్), ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాలను సిద్ధం చేస్తే తరగతులు ప్రారంబించే అవకాశముంటుంది. అనంతరం క్రమక్రమంగా నిర్మాణాలు చేపడుతూ పూర్తిస్థాయిలో కళాశాలను తరలించాలనే యోచనలో ఉన్నారు.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా...



ప్రస్తుతం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నాలుగో ఏడాదికి వచ్చేలోగా ఇబ్బంది ఏర్పడే అవకాశముంది. బోధన, హాస్టల్ వసతి కల్పించడం కష్టమవుతుంది. అందువల్ల భవిష్యత్ అవసరాల దృష్ట్యా 45 ఎకరాల స్థలాన్ని మెడికల్ కాలేజీకి ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఉన్న కళాశాలలో ఎన్‌ఎంసీ నుండి అనుమతులు రాగానే ఈ ఏడాది అక్టోబర్‌లో రెండో ఏడాది బోధన మొదలవుతుంది. నూతనంగా కళాశాలలో తొలుత మూడో ఏడాది విద్యార్థులకు బోధన మొదలుపెట్టి.. ఆతర్వాత పూర్తస్థాయిలో నిర్మాణాలు చేసి మొత్తం కళాశాలను తరలిస్తాం.

– డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

ఎమ్మెల్సీ ఓటర్ల లెక్క తేలింది..

జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 83,600మంది

ఖమ్మం సహకారనగర్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్ల లెక్క తేలింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను గురువారం అధికారులు విడుదల చేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 115 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనుండగా, 83,600మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో పురుషులు 50,513మంది, మహిళలు 33,083మందితో పాటు ఇతరులు నలుగురు ఉన్నారు. గతేడాది డిసెంబర్‌లో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగా, ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. ఫిబ్రవరి 24న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించే నాటికి 76,869మంది ఓటర్లు ఉన్నారు. గతనెల 14వ తేదీ వరకు ఓటర్ల నమోదు కోసం దరఖాస్తులు స్వీకరించిన అధికారులు పరిశీలన అనంతరం 83,600మంది ఓటర్లతో తుది జాబితా విడుదల చేశారు. కాగా, ముసాయిదాతో పోలిస్తే 6,731 మంది ఓటర్లు పెరగగా.. అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతోనే ఇది సాధ్యమైందని అధికారులు వెల్లడించారు.

‘మద్దతు’ దక్కని పెసర

ఉమ్మడి జిల్లాలో 9 వేల ఎకరాల్లో పంట సాగు

- యాసంగిలో కొనుగోళ్లపై దృష్టి సారించని ప్రభుత్వం
- ఇదే అదునుగా తక్కువ ధర చెల్లిస్తున్న వ్యాపారులు
- క్వింటాల్‌కు రూ.1,500 మేర నష్టపోతున్న రైతులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చిన పెసలు

ఖమ్మంవ్యవసాయం: యాసంగిలో సాగు చేసిన పెసర పంటకు మద్దతు ధర దక్కటం లేదు. పంట ప్రస్తుతం చేతికందుతుండగా, కొందరు రైతులు విక్రయాలు సాగిస్తున్నారు. పెసల నాణ్యత ఆధారంగా వ్యాపారులు గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.7,900 వరకు ధర పెడుతున్నారు. నాణ్యత తక్కువగా ఉంటే రూ.5 వేలకు మించి రావడం లేదు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.8,558గా మద్దతు ధర ప్రకటించినా, ఆ రేటు రైతులకు అందడంలేదు. ప్రభుత్వం కొనుగోళ్లపై దృష్టి సారించకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఇదే తంతు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోడంలేదు.

వర్షాల్లేక తగ్గిన సాగు, దిగుబడి

ఈ ఏడాది ఆశించిన వర్షాలు లేకపోవడంతో యాసంగిలో పెసర సాగు గణనీయంగా తగ్గింది. ఉమ్మడి జిల్లాలో ఏటా దాదాపు 20 వేల ఎకరాలకు పైగా రైతులు పెసర సాగు చేసేవారు. ఈ ఏడాది జలాశయాలు, భూగర్భంలో నీరు లేక 9,130 ఎకరాల్లోనే సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 8,631 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 499 ఎకరాల్లో పంట సాగైంది. నీటి తడులు సమృద్ధిగా అందిన చోట ఎకరాకు 5నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రాగా, అరకొరగా నీటి తడులు తీసుకున్న పైర్లు ఎకరాకు 2నుంచి 3 క్వింటాళ్ల దాటడం లేదు. ఇటు దిగుబడి లేక, అటు ధర లేక రైతులు రెండు విధాలా నష్టపోతున్నారు.

నాఫెడ్ కొనుగోళ్లు చేపడితే మేలు

పంట నాణ్యతగా ఉన్నా క్వింటాల్‌కు రూ.1,500 పైగా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.8,558 ఉండగా.. వ్యాపారులు సగటున రూ.7 వేలకు మించి ధర పెట్టడం లేదు. ఇక నాణ్యత లేని పంటైతే రూ.5,500 వరకే చెల్లిస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు నాఫెడ్ సహకారంతో మార్క్‌ఫెడ్ పెసలను కొనుగోలు చేసింది. ఈసారి కూడా అలా కొనుగోళ్లు చేపడితేనే వ్యాపారులు సైతం ధర పెంచే అవకాశం ఉంటుంది.


జెండా పాటలో వ్యాపారులు, రైతులు

వ్యాపారుల సిండికేట్!

పెసర కొనుగోళ్లలో వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు న్యాయం జరిగే అవకాశమున్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో వ్యాపారులు గ్రామాల్లో క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6,500 వరకు చెల్లిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.5,500 నుంచి రూ.7,900 వరకు ధర పలుకుతోంది. పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

క్వింటాల్‌కు రూ.7వేలే...



నీటి సౌకర్యం సరిగా లేక ఎకరంలోనే పెసర సాగు చేశా. ఆరు బస్తాల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.8,558 కాగా వ్యాపారులు రూ.7,300కే కొనుగోలు చేశారు. ఇక కమీషన్లు, రవాణా, తరుగు పోతే క్వింటాకు రూ.7వేలకు మించి రాలేదు. మద్దతు ధరతో పోలిస్తే క్వింటాకు రూ.1,500 మేర నష్టపోయా.

– వంగూరి ప్రభాకర్, తెట్టెలపాడు, తిరుమలాయపాలెం మండలం

నాణ్యత ఉన్నా ధర రాలేదు..



ఎనిమిదిన్నర ఎకరాల్లో పెసర సాగు చేశా. ప్రస్తుతం రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన పెసర పంటను విక్రయానికి తీసుకువచ్చా. పెసలు బాగున్నాయని జెండాపాట పెట్టారు. జెండాపాటలో కనీస మద్దతు ధర కూడా లభించలేదు. నాణ్యమైన పెసలకు రూ.7,900 ధర నిర్ణయించారు. ప్రభుత్వ ధర ఎక్కువగా ఉంది కదా అన్నా పట్టించుకోలేదు.

– వెల్లంపల్లి నాగేశ్వరరావు, నాగులవంచ, చింతకాని మండలం

క్లుప్తంగా

రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు ప్రమాణస్వీకారం


రాజ్యసభ చైర్మన్ ధనఖర్‌తో రవిచంద్ర, కుటుంబీకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. న్యూఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో ఆయనతో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధనఖర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్‌తో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ తదితరులు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య విద్యార్థుల అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్: కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యాన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న వైద్యవిద్యార్థుల అథ్లెటిక్స్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. యూనివర్సిటీ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి 68 మెడికల్ కళాశాలలకు చెందిన 580 మంది వైద్యవిద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో ఆతిథ్య కేఎంసీ క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా, ఖమ్మం మమత మెడికల్ కాలేజీ విద్యార్థులు రెండో స్థానం దక్కించుకున్నారు. అంతేకాకుండా వ్యక్తిగత పురుషుల విభాగం, మహిళ విభాగాల్లోనూ మమత కాలేజీ విద్యార్థులు రెండో స్థానంలో నిలవగా... విజేతలకు యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

కొనసాగుతున్న మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబపత్రాల మూల్యాంకనం గురువారం రెండో రోజుకు చేరింది. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో బుధవారం స్పాట్ వాల్యుయేషన్ మొదలుకాగా, గురువారం సుమారు 950 మంది పాల్గొని 47,796 పేపర్లు మూల్యాంకనం చేశారు. ఇదిలా ఉండగా బుధవారం విధులకు గైర్హాజరైన 162 మంది ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడంతో అందులో 100 మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి వరుసగా ఐదు రోజుల సెలవులు వచ్చాయి. శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 6న శనివారం, 7న ఆదివారం, 8వ తేదీన అమావాస్యతో పాటు 9వ తేదీ ఉగాది సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆతర్వాత 10వ తేదీ బుధవారం మార్కెట్‌లో కొనుగోళ్లు మొదలవుతాయని, ఈ విషయాన్ని రైతులు, కార్మికులు, వ్యాపారులు గుర్తించాలని కోరారు.

డయల్ 100కు 4,205 ఫోన్లు

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల సమస్యలకు సంబంధించి ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేలా ప్రవేశపెట్టిన డయల్ 100కు మార్చిలో 4,205 మంది ఫోన్ చేశారని సీపీ సునీల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 75 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వెల్లడించారు. వీటిలో మహిళలపై వేధింపులు, చోరీలు, ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు వంటివి ఉన్నాయని తెలిపారు.

రూ.3.46 కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మంకు చెందిన కొంగర రామకృష్ణ 24 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ రూ.3,46,10,539కు దివాళా పిటీషన్(ఐపీ) గురువారం దాఖలు చేశాడు. స్టాక్ మార్కెట్ ద్వారా షేర్లు కొనుగోలు చేసిన ఆయన పలువురి వద్ద అప్పులు చేశాడు. అయితే, ఇప్పుడు నష్టం వచ్చి అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ తన న్యాయవాదుల ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

వివాహిత మృతిపై కేసు నమోదు

కూసుమంచి: మండలంలోని గురువాయిగూడెంకు చెందిన ధరావత్ పంతులు కుమార్తె సంధ్య (23) ఈనెల 2న జ్వరంతో మృతిచెందగా ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దానియాతండాకు చెందిన బానోత్ నరేష్‌తో సంధ్యకు వివాహం జరగగా, కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ఆమె జ్వరం బారిన పడింది. దీంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.14,174

అనుభవపూర్వక పంటల సాగుతో మేలు


మాట్లాడుతున్న హేమంత్‌కుమార్, పక్కన డీఏఓ విజయనిర్మల, అధికారులు, శాస్త్రవేత్తలు

వైరా: సహచర రైతులు సాధించిన దిగుబడి, ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే నష్టం ఎదురుకాకుండా కాపాడుకోవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైరాలోని కృషి విజ్ఞాన భవన్‌లో రైతు సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో హేమంత్‌కుమార్, విజయనిర్మల మాట్లాడుతూ ఎంత సాంకేతికత వచ్చినా రైతులు అనుభవం ద్వారానే మెళకువలు నేర్చుకుంటారన్నారు. ఈమేరకు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూనే సహచర రైతుల అనుభవాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈసందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీ.వీ.రమణ, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వేణుమనోహర్‌తో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.భరత్, తుమ్మల రాణాప్రతాప్, కృష్ణతేజ, రెడ్డి ప్రియ, డాక్టర్ జెస్సీ సునీత, డాక్టర్ రవి, ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు,

ఖమ్మం టౌన్–4 ఏఈ సరెండర్

ఖమ్మంవ్యవసాయం: విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన ఖమ్మం విద్యుత్ ఆపరేషన్స్ సర్కిల్ పరిధిలోని ఓ ఏఈని అధికారులు సరెండర్ చేశారు. ఖమ్మం టౌన్–4 అసిస్టెంట్ ఇంజనీర్(ఆపరేషన్స్) శ్రీధర్‌రెడ్డి విద్యుత్ సర్వీసులు, ఇతర కాంట్రాక్ట్ పనుల్లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈమేరకు ఆయనను ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేయగా, శ్రీధర్‌రెడ్డి స్థానంలో సబ్ ఇంజనీర్ ఖదీర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఏసీబీకి చిక్కిన ఏసీటీఓ

రూ. 10 వేల నగదు స్వాధీనం


ఉద్యోగులను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

కల్లూరు/అశ్వారావుపేట: ఆధారాల్లేని నగదు ఉండడంతో వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీఓ శ్రీరామ్, సిబ్బందిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరులోని తిరువూరు క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున శ్రీరామ్, సిబ్బంది వాహనాల పత్రాలను పరిశీలిస్తుండగా, వారిని ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. వాణిజ్యశాఖ అధికారులు అక్రమంగా వాహనదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుతో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీటీఓ శ్రీరామ్, సిబ్బంది వద్ద సరైన ఆధారాలు లేని రూ.10 వేల నగదు ఉండడంతో సీజ్ చేసి ఉద్యోగులను ఖమ్మం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈమేరకు ఏసీటీఓ శ్రీరామ్, ఆఫీస్ సబార్డినేట్ రాజ్‌కుమార్, డ్రైవర్ జంగం మణికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

వసూళ్లపై ‘సాక్షి’లో ముందుగానే కథనం

అశ్వారావుపేటలో రాత్రి వేళల్లో కొందరు అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఈనెల 2న ‘సాక్షి’లో ‘పేటలో కమర్షియల్ దాడులు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. మరుసటి రోజే ఏసీటీఓ శ్రీరాంను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బిల్లులు లేని సరుకు తరలిస్తున్న వాహనదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉండగా, తాజాగా ఏసీబీ తనిఖీలతో సందేహాలకు సమాధానం లభించినట్లయింది.

ఆర్టీసీ కార్గోలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్

సాక్షి ఎఫెక్ట్..


పార్శిళ్లు బుకింగ్ చేస్తున్న వినియోగదారులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్గో సేవలకు వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌ను ఆర్టీసీ యాజమాన్యం అప్‌డేట్ చేసింది. కొత్త సాఫ్ట్‌వేర్ మార్చాక తరచుగా సేవల్లో అంతరాయం ఏర్పడుతుండడంపై బుధవారం ‘సాక్షి’లో ‘సాఫ్ట్‌వేర్ మారింది.. పని ఆగింది’శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం బుధవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల వరకు కార్గో సేవలను నిలిపివేసి సాఫ్ట్‌వేర్‌ను పూర్తి స్థాయిలో అప్‌డేట్ చేసింది. దీంతో గురువారం ఉదయం బుకింగ్‌ల్లో వేగం పెరగడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.

‘ఉపాధి’ కూలీకి అస్వస్థత

కూసుమంచి: కూసుమంచిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వచ్చిన కనకం భారతమ్మ గురువారం అస్వస్థతకు గురైంది. ఎండ తీవ్రతతో ఆమె అస్వస్థతకు గురికాగా ఆమెకు ప్రథమ చికిత్స చేశారు. బుధవారం కూడా కూసుమంచికి చెందిన కూలీ నిమ్మరబోయిన ఉప్పమ్మ తీవ్ర అస్వస్థతకు గురికాగా చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ఎండ కారణంగా ఉపాధి కూలీలు వరుసగా అస్వస్థతకు గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

సుగుణ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం చర్చికాంపౌండ్ ప్రాంతంలోని సుగుణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆస్పత్రిలో అక్రమంగా అబార్షన్లు నిర్వహిస్తున్నారనే సమాచారంతో గత నెల 28వ తేదీన డీఎంహెచ్‌ఓతో పాటు అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు గర్భిణులకు అబార్షన్‌కు సిద్ధమైనట్లు గుర్తించి ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈమేరకు ఆస్పత్రి యాజమాన్యంపై ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు సైతం నమోదైంది. ఆతర్వాత నోటీసులు జారీ చేసిన అధికారులు విచారణలో అబార్షన్లు చేయడం నిజమేనని తేలడంతో తెలంగాణ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010, 2011 రూల్స్ ప్రకారం సుగుణ ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

కార్మికుల పనివేళలు మార్చాలి


అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎండలు పెరుగుతున్న దృష్ట్యా మున్సిపల్ కార్మికుల పని సమయంలో మార్పులు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య కోరారు. ఈ సందర్భంగా గురువారం కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజులుగా ఎండల తీవ్రత పెరిగిందని, జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతున్నందున ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేసేలా కార్మికులకు వెసులుబాటు కల్పించాలని కోరారు. అలాగే, కార్మికులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, దున్న గురవయ్య, వీరబాబు, వెంకన్న, రాజు, పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

- ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్తుండగా ప్రమాదం


బండి సురేష్ (ఫైల్)

బోనకల్: ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్తున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బోనకల్‌కు చెందిన బండి సురేష్(40) గురువారం ఉదయం ఫోన్ మాట్లాడుతూ రైల్వే పట్టాలు దాటుతున్నాడు. ఈక్రమంలో అటుగా వస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలును సురేష్ గమనించకపోవడంతో ఢీకొట్టింది. ఈఘటనలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం ఆటోనగర్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓవ్యక్తి మృతి చెందాడు. ఆయనను భిక్షాటన చేసే వ్యక్తిగా భావిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మధిర: మధిర–మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య సీఎస్ఐ చర్చి సమీపాన గుర్తు తెలియని వ్యక్తి(30) గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని జీఆర్పీ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు.

ధర్మయుద్ధంలో బీజేపీదే విజయం

- భద్రాచలం నుంచి అయోధ్య వరకు ఆధ్యాత్మిక కారిడార్
- బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు


సత్తుపల్లిలో మాట్లాడుతున్న వినోద్‌రావు, పక్కన నాయకులు

సత్తుపల్లి/మధిర/అశ్వారావుపేట: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ధర్మయుద్ధం జరగనుండగా.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీకే విజయం దక్కుతుందని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. సత్తుపల్లి, మధిర, అశ్వారావుపేటల్లో గురువారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ కేంద్రంలో మోదీ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, జిల్లాలో బీజేపీ ప్రతినిధి లేకపోతే అభివృద్ధికి అడ్డంకిగా మారనున్నందున తనను గెలిపించేలా కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని మరింత అభివృద్ధి చేసి అయోధ్య వరకు ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా, పాలకుల వైఫల్యం వల్ల ఎన్నో ప్రాజెక్టులు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రాలేదని.. తనను గెలిపిస్తే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి భాగస్వామినవుతానని చెప్పారు. కాగా, సత్తుపల్లిలో బీజేపీ నాయకుడు దారపనేని కోటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బీజేపీతో పాటు మిత్రపక్ష పార్టీల నాయకులు భాస్కర్ల వీరంరాజు, నాగేశ్వరరావు, సిలివేరు సాంబశివరావు, పారుపల్లి సురేష్, సుదర్శన్ మిశ్రా, గొట్టిముక్కల శ్రీనివాసరావు, గాదె రాంబాబు, మడివి రవి, మద్దాల దేవి, బండారు చందు, శ్యాంసుందర్‌నాయక్, చావా కిరణ్, నాయుడు రాఘవరావు, పాలకొల్లు శ్రీను, బాలకృష్ణారెడ్డి, ఆచంటి నాగస్వామి, ఆపద రామారావు, పుల్లారావు, కొలికపోగు వెంకటేశ్వరరావు, గొల్లమూడి శ్రీను, ముత్తారావు, డేవిడ్, రమేష్ పాల్గొన్నారు.

భద్రాద్రి రాముడి కల్యాణోత్సవానికి గోటి తలంబ్రాలు


పాదయాత్రగా భద్రాద్రి ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్/భద్రాచలం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం జరగనుండగా ఖమ్మంకు చెందిన శ్రీ లక్ష్మీ బాలాజీ సేవా సమితి బృందం సభ్యులు గురువారం కోటి గోటి తలంబ్రాలను సమర్పించారు. చింతకాని మండలంలో సేవా సమితి బాధ్యులతో పాటు కొందరు రైతులు వరి పంట సాగు చేయగా, ధాన్యాన్ని గోటితో వలిచి తలంబ్రాలు సిద్ధం చేశారు. ఈ తలంబ్రాలకు ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు చేశాక ఇందిరానగర్ పర్ణశాల రామాలయం వద్దకు శోభాయాత్రగా చేరుకుని బస చేశాక.. గురువారం ఉదయం భద్రాచలం ఆలయంలో సమర్పించారు. సేవా సమితి అధ్యక్షురాలు వడ్డే లక్ష్మితో పాటు భక్తులు పాల్గొన్నారు. అలాగే, హైదరాబాద్‌కు చెందిన భక్తులు కూడా గోటి తలంబ్రాలతో పాటు సీతమ్మకు సారె సైతం అందజేశారు.

కుమార్తె పెళ్లికి వస్తుండగా ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు
- ముహూర్తం దాటిపోతుండడంతో తల్లిదండ్రులు లేకుండానే పెళ్లి


ఘటనా స్థలంలో పడి ఉన్న సైదులు దంపతులు

కొణిజర్ల: కుమార్తె పెళ్లి ఘనంగా చేయడానికి సిద్ధమైన తల్లిదండ్రులు వేదిక వద్దకు వస్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఓ పక్క ముహూర్తం సమీపిస్తున్నా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు రాలేని పరిస్థితి ఉండడంతో తల్లిదండ్రులు లేకుండానే పెళ్లి తంతు పూర్తిచేయాల్సి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెంకు చెందిన ఏదులాపురం సైదులు, మంగ దంపతుల ఏకైక కుమార్తె రమ్య వివాహం కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన బొడ్డుపల్లి నరేందర్‌తో నిశ్చయమైంది. తుమ్మలపల్లిలో గురువారం ఉదయం 9.15 గంటలకు వివాహం జరగాల్సి ఉండగా.. బుధవారం రాత్రే బంధువులతో పాటు కుమార్తెను పంపించారు. ఇక గురువారం ఉదయం సైదులు దంపతులు ద్విచక్ర వాహనంపై తుమ్మలపల్లి వస్తుండగా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల సమీపాన వారి వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈఘటనలో దంపతులిద్దరి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా ఖమ్మం తరలించారు. అయితే, తీవ్రగాయాలతో వారు ఆస్పత్రి నుంచి రాలేని పరిస్థితి ఉండగా.. వివాహ ముహూర్తం సమయం దాటి పోతుండడంతో వధువు తల్లిదండ్రులు లేకుండానే వివాహ తంతు ముగించారు.